بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 31.10.2015 (Telugu)

## హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 31.10.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు వివరించిన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పలు సంఘటనలు, సామెతలను వివిధ చోట్ల నుండి సేకరించి నేడు నేను ప్రస్తావింతును. ప్రతి సంఘటన లేదా సామెత తన పరిధిలో ఒక ఉపదేశము కలిగియుండును. జమాఅత్ సభ్యులు తమ విద్యను పెంచుకోవలెను. ధార్మిక విద్య కలిగియున్నవారు కూడ వర్తమాన విషయాలు తెలిసియుండవలెను. చరిత్ర కూడ చదివియుండవలెను. ప్రత్యేకంగా మురబ్బీలు, ముబల్లిఘీన్లు విశిష్ట దృష్టి సారించవలెను. నేటి ప్రపంచములో ఈ విషయములు చాలా సులభంగా లభించుచున్నవి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పేరున హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు విద్యావగాహనను పెంచుకోవాలని సూచించు ఒక సామెతను తెలిపిరి. ఒక వ్యక్తి మహా పురుషునిగా పేరు పొందెను. అనుకోకుండా ఒక మంత్రి అతనికి అభిమానిగా మారెను. తుదకు ఆ మంత్రి రాజు గారు కూడ తప్పక దర్శించాలని కోరెను. వారు (ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు) ఇట్లనిరి. అతడు మహా పురుషుడో కాదో తెలియదు కాని తప్పక అవివేకుడే. రాజు అతన్ని కలవడానికి వచ్చినప్పుడు ఆ మహా పురుషుడు ఇట్లనెను. రాజు గారు మీరు తప్పక న్యాయముగా వ్యవహరించవలెను. ముస్లిములలో సికందర్ నామము గల రాజును చూడండి! అతనెంత న్యాయవంతుడో నేటికి అతని నామము మారుమ్రోగుచున్నది. వాస్తవానికి సికందర్ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కాలము కంటే చాలా పూర్వము, వాస్తవానికి హజ్రత్ ఈసా అలైహిస్సలాం కంటే కూడ పూర్వము గడిచెను. కాని అతడు సికందర్‌ను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కాలము తరువాత జరిగిన ముస్లిం రాజుగా పేర్కొనెను. అతడు రాజును ప్రభావితం చేసే బదులు భిన్నమైన ప్రభావము పడెను. కనుక రాజు గారు తక్షణమే లేచి వెళ్లిపోయిరి. చరిత్ర తెలుసుకోవడం ధార్మిక వ్యక్తికి తప్పనిసరి కాదు. కాని ఈ ఆపదను తనను తాను ధార్మిక సజ్జనుడిగా చలామని అగుచున్న వ్యక్తే తనపై వేసుకొనెను. మానవుడు సత్యమును వీడి నామమాత్రపు ధార్మికత వేషము వేసుకున్నప్పుడు ఈ విధముగనే అవమానము చెందును, ఇటువంటి ఫలితమునే చవిచూచును.

ఒకరిని శపించుటకు ప్రజలు తొందరపడుదురని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. మనమెవరిని శపించకూడదనే నియమము విధించుకోవలెను. మనము మన వ్యతిరేకుల కొరకు దుఆ చేయవలెను. తుదకు వారే విశ్వసింతురు. హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం గారిట్లనిరి. నేను పైన అరుగుల వద్ద యుండేవాడిని. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గృహములోని క్రింది భాగములో యుండేవారు. ఒక స్త్రీ కానుపు సమయమున రోధించినట్లు నాకు రోధన వినిపించెను. కాను ఆశ్చర్యము కలిగి నేను కొంచెం శ్రద్ధగా వినగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆ చేయుచున్నట్లు నాకు తెలిసినది. వారిట్లంటున్నారు. ఓ అల్లాహ్! మహమ్మారి వ్యాపించుచున్నది. దీని వలన ప్రజలు చనిపోవుచున్నారు. వీరందరు చనిపోయినచో నిన్ను ఎవరు విశ్వసింతురు. మహమ్మారి గురించి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వార్తనందించిరి. మహమ్మారి సంకేతము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భవిష్యవాణీల ద్వారా తెలియును. ఏ వ్యక్తి సత్యమును బహిర్గతము చేయుటకు మహమ్మారి వచ్చినదో ఆ వ్యక్తే రోధించుచు ఓ అల్లాహ్! వీరందరు చనిపోయినచో నిన్ను ఎవరు విశ్వసింతురని అంటున్నాడు. కనుక ఒక విశ్వాసి సాధారణ ప్రజల పట్ల శాపము చేయరాదు.

ఎవరినైతే ఉన్నత స్థాయికి చేర్చాలని మనము నిలబెట్టబడితిమో వారినెట్లు శపించగలము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి.

اے دل تو نیز خاطر ایناں نگاہ دار کاخر کنند دعوی حبِّ پیمبرم

అనగా ఓ నా హృదయము వారు దురాలోచనలో పడకూడదని ఆ ప్రజల మనోభావాలను, ఆకాంక్షలను గౌరవించుము.

అలసిపోయి వారిని శపించకుము. వాస్తవానికి వారికి నీ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ప్రేమ కలదు. ఆ ప్రేమ వల్లనే వారు నిన్ను దూషించుచున్నారు. సాధారణ ప్రజలు అమాయకులు. మౌల్వీలు వారికి నేర్పినదే వారు చేయుదురు. దుష్ట ఉలమాల, నాయకుల నుండి అల్లాహ్ సమాజమును రక్షించాలని, ప్రజలు సత్యమును గుర్తించాలని మనము దుఆ చేయవలెను. నిజమైన ముస్లిమునకు ఆపదలు, కష్టములు, ప్రమాదములు ఏర్పడినప్పుడు అల్లాహ్ తాలా అతని కొరకు మేలు కలిగే ఏర్పాటు చేయునని తెలుపుచు వారిట్లనిరి. హజ్రత్ మౌలానా రూమ్ పంక్తి ఇట్లు గలదు. ہربلاکیں ایں قوم رااُودادہ است     زیرآں یک گنج ہابنہادہ است

అనగా ఒక జాతిపై అల్లాహ్ తాలా ఏ ఆపద వేసినను దాని క్రింద పెద్ద నిధిని యుంచును. దీనిని ఎల్లప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ చదివేవారు. ఏదైనా జాతి, పక్షము నిజమైన ముస్లిం అయినచో వారు ఎదుర్కొనిన సర్వ ఆపదలు, ప్రమాదములు వారి కొరకు మోక్షము, ప్రగతికి కారణమగును. కష్టముల తరువాత సుఖములు వచ్చునను విషయము సత్యమును పరీక్షించుటకు గొప్ప ప్రామాణికం. ప్రతి ఆపద మన కొరకు ప్రగతిని తీసుకొచ్చెనని అహ్మదియ్య జమాఅత్ చరిత్ర సాక్షిగా యున్నది.

ఒకరి వెంట యుంటున్నప్పుడు తెలియకుండానే దుష్ట మానవుని ప్రభావము పడును. దుష్ట ఆలోచనల ప్రభావము బాహ్య రూపంలో చెప్పకున్నను కేవలము సహవాసములో యుండడంతో పడునను విషయమును తెలుపుచు వారిట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను అభిమానించే ఒక సిక్కు విద్యార్థి ప్రభుత్వ కళాశాలలో చదువుచుండెను. గతములో నాకు దేవునిపై నమ్మకముండెను. కానిప్పుడు అనుమానములు కలుగుచున్నవని అతడు చెప్పి పంపెను. మీరు కళాశాలలో కూర్చుంటున్న సీటును మార్చగలరని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతనికి చెప్పి పంపిరి. కనుక అతడు స్థలము మార్చుకొనెను. తరువాత ఇప్పుడు దేవుని గురించి అనుమానములు కలగడం లేదని కూడ అతడు చెప్పి పంపెను. అతని ప్రక్క కూర్చున్న వ్యక్తి ప్రభావము అతనిపై పడుచుండెనని వారు తెలిపిరి. ఆ వ్యక్తి నాస్తికుడు. స్థలము మార్చుకున్నందున ప్రభావము పడక అనుమానములు కూడ దూరమైనవి. ఇటులనే టి.వి. కార్యక్రమములు గలవు. ఇటువంటి కార్యక్రమములు చూడకుండా పెద్దలు పిల్లలను నిరోధించవలెను. తాము చూడడం వలన కూడ పిల్లలపై చెడు ప్రభావము పడును. తమ గృహ వాతావరమును పవిత్రముగా యుంచవలసిన బాధ్యత తమదేనని తల్లిదండ్రులు గుర్తుంచుకోవలెను. ఎందుకనగా తెలియకుండానే వీటి ప్రభావము పిల్లలపై పడును, శిక్షణ పై పడును.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు మరో చోట ఇట్లు తెలిపిరి. దుఆ కొరకు సంబంధము అవసరమని కొందరితో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేవారు. సంబంధము పెరగాలని వారీ పద్ధతిని అవలంభించేవారు. ఇందుకు అనేక సార్లు హజ్రత్ గారొక సామెతను వినిపించిరి. తన గృహపు దస్తావేజులు పోయినవని దుఆ చేయించుటకు ఒక వ్యక్తి ఒక సత్యవంతుని వద్దకు వెళ్లెను. నేను దుఆ చేయుదును కాని మొదలు నా కొరకు హల్వ తీసుకొని రమ్మని వారనిరి. దుకాణాదారుడు హల్వను ఒక కాగితములో వేసి కట్టుచుండగా అతని వద్ద ఒక కాగితము పడియుండెను. వీటిని చింపకుము. ఇవే నా గృహపు దస్తావేజులని అతడు అరిచెను. దీని కొరకే నేను దుఆ చేయించదలచితిని. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా మనకు అనేక సంఘటనలు తెలియును. సత్కార్యములలో ఒకరిని మరొకరు మించుటకు సూచించును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇద్దరు నుచరుల గురించి ఇట్లు వినిపించేవారు. ఒక అనుచరుడు ఒక గుర్రమును విక్రయించుటకు బజారుకు తెచ్చెను. మరొకరు అతన్ని ధర అడిగిరి. అతడు ఏదో ఒక ధర చెప్పెను. కాని దీని ధర ఇంత కాదు ఇంత (ఎక్కువ) అని రెండవ అనుచరుడు చెప్పెను. నీతి, నిజాయితీకి చెందిన ఇదొక చిన్న సంఘటన అని వారు తెలిపేవారు. ఇది మన శిక్షణ కొరకు, మనకు పుణ్యము దక్కుటకు అనివార్యమైనట్లే తమ సంతాన శిక్షణ కొరకు కూడ అనివార్యమగును. దీనికి తోడు జమాఅత్ అభివృద్ధికి కూడ కారణమగును. నీతికి చెందిన ఈ ప్రమాణములను మనము నెలకొల్పవలెను.

మరో ముఖ్యమైన విషయము వైపు అహ్మదీయులు దృష్టి సారించవలెను. సర్వ విశిష్టతలకు యజమాని అల్లాహ్‌యేనని గుర్తుంచుకోవలెను. ఒకరికి సన్మార్గము చూపవలసినది కూడ అల్లాహ్ కార్యమే. సందేశమును అందించు అను కార్యమునే అల్లాహ్ తాలా మనకు అప్పగించెను. కాని సన్మార్గము అందించుట అల్లాహ్ తాలా కార్యమే. సాధ్యమైనంత వరకు ప్రతిభను మొత్తం ధారపోసి ఈ కార్యమును చేయుచు ఫలితములను అల్లాహ్

తాలాకే వదిలివేయవలెను. ఫలానా వ్యక్తి అహ్మది అయినచో జమాఅత్ ప్రగతి చెందునని ఎన్నడు ఆలోచించకూడదు. అల్లాహ్ తాలా శుభములను పొందుటకు మన దృష్టి సారించవలెను. కనుక వినయ, విధేయతలో ముందడుగు వేయు, ధార్మిక ప్రగతిలో పాల్గొనువారిని జమాఅత్‌నకు ప్రసాదించాలని దుఆ చేయవలెను.

దుర్మార్గము నుండి మానవజాతిని రక్షించాలనే బాధ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఎంత యుండెనో ఒక ఉదాహరణను తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో ఒక నిరక్షరాస్యురాలు అయిన స్త్రీ వచ్చి నా కుమారుడు క్రైస్తవ మతంలో చేరినాడు. అతడు తిరిగి ఇస్లాంలో చేరాలని మీరు దుఆ చేయగలరని అనెను. నీవు అతన్ని నా వద్దకు పంపుచుండుము, తద్వారా అతడు అల్లాహ్, అతని ప్రవక్త వచనాలను వినునని వారనిరి. అతడు టి.బి. వ్యాధి వలన అనారోగ్యముతో బాధ పడుచుండెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ (రజి) వద్దకు చికిత్స కొరకు వచ్చుచుండెను. అతడు వారి వద్దకు వచ్చినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతనికి ఉపదేశము చేసేవారు. ఇస్లాం విషయములను తెలియపరచేవారు. తద్వారా అల్లాహ్ తాలా ఆ స్త్రీ కోరికను మన్నించినందున ఆ బాలుడు ఇస్లాంలో చేరెను. ఇస్లాంలో చేరిన తరువాత కొన్ని రోజులకు ఆ నిస్సహాయుడు మరణించెను కూడ. తిరిగి ఇస్లాంలో చేర్పించుటకు అంతిమ ఉపాయము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దనే యున్నదని, ఇస్లాం నిజమైన బాధ, వ్యాకులత వారికే యున్నదని, సందేశమందించి ఒప్పించగలరని ఆ స్త్రీకి కూడ తెలిసియుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంస్కరణ పద్ధతిని తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. సంస్కరణ గురించి హజ్రత్ గారి పద్ధతి ఎంతో మనోహరమైనది, విచిత్రమైనది. ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి, నా వద్ద సరిపడ నగదు లేనందున రైల్వేలో ఒక మినహాయింపు పద్ధతిలో ప్రయాణించి వచ్చినానని చెప్పెను. బహుశా అది అనుచితమైనది కావచ్చును. ఇక ముందు ఇలా చేయవలసిన అవసరముండదని తెలుపుచు ఒక్క రూపాయి అతనికిచ్చిరి. ఆ కాలములో ఒక్క రూపాయి విలువ చాలా ఎక్కువ యుండెను. ఇలా సమంజసమైన పద్ధతినే సదా అవలంభించవలెనని అతనికి సర్ది చెప్పిరి. జమాఅత్ సభ్యులు ఏదో ఒక పని నేర్చుకోవాలని, కష్టించే అలవాటు చేసుకోవాలని తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక చోట గట్టిగా సూచించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలపు ఒక సంఘటన తెలిపిరి. వారి కాలములో ఒక అబ్బాయి ఫిజా అని యుండెను. ఒక సారి కొందరు అతిథులు వచ్చిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చాయె చేయించి ఈ అతిథులకు చాయె అందివ్వమని ఆ ఫిజెతో అనిరి. వారి వద్ద చరాఘ్ అను పాత ఉద్యోగి కూడ యుండెను. ఇద్దరిని ఈ పని మీద నియమించిరి. వీరిద్దరు చాయె తీసుకొని పోగానే ఆ చరాఘ్ పాత ఉద్యోగి అయినందున హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ (రజి) గొప్పతనము, నిష్టాపరత తెలిసియున్నందున చాయె మొదట వారికందించెను. కాని ఫిజే గారు అతని చెయ్యి పట్టుకొని హజ్రత్ గారు చెప్పిన వారిలో వీరి పేరు లేదని అనెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. అతడెంత బుద్ధిహీనుడనగా అతన్ని ఒక ఉద్యోగితో నియమించబడినప్పుడు అతడే ఉద్యోగిగా మారెను. ఇటువైపు సూచించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ప్రజలు కొంతైనా దృష్టి సారించినచో వృధాగా కూర్చున్నవారు, ఇతర దేశములలో, ఇక్కడ కూడ కూర్చునువారు కొంచమైనా శ్రద్ధ వహించి ఏదైనా పని నేర్చుకోవచ్చును, సంపాదించవచ్చును. ప్రజా సేవ కార్యక్రమాలలో పాల్గొనవచ్చును.

అల్లాహ్ తాలా పట్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పౌరుషమును తెలుపు ఒక సంఘటనను వారిట్లు తెలిపిరి. ఒక వ్యక్తి తరువాత చాలా విధేయులైన అహ్మదీ అయిరి. కాని అహ్మది కాక ముందు హజ్రత్ గారు ఒక విషయము వలన వారితో 20 సం॥ల వరకు అసంతృప్తితో యుండిరి. వారి ఒక కుమారుడు మరణించెను. హజ్రత్ గారు తమ సోదరునితో కలిసి పరామర్శించుటకు పోయిరి. వారు హజ్రత్ గారి పెద్ద సోదరున్ని ఆలింగనము చేసుకుంటూ రోధించుచు అల్లాహ్ నాపై పెద్ద దౌర్జన్యము చేసెనని అనెను. నవూజుబిల్లాహ్. వారితో ఎంత అసహ్యత కలిగెననగా వారి ముఖము కూడ చూడుటకు ఇష్టపడేవారు కాదు. అల్లాహ్ తాలా అతనికి అనుగ్రహము కలిగించెను. తద్వారా అతను ఈ మూర్ఖత్వముల నుండి బయటపడి, అహ్మదియ్యత్ స్వీకరించెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. దైవ ఉనికి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సంఘటన వినిపించేవారు. హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్మాయిల్ గారితో ఒక నాస్తికుడు చదువుచుండేవాడు. ఒక సారి భూకంపము రాగా అతని నోటి నుండి రామ్ రామ్ అని అనుకోకుండా వెలువడెను. అతను గతములో హిందువు, కాని తరువాత

నాస్తికుడయ్యెను. నీవు దేవుని ఉనికిని నిరాకరించేవాడవు, మరి నీ నోటి నుండి రామ్ అని ఎందుకు వెలువడెనని మీర్ గారడిగిరి. పొరపాటైనది, అనుకోకుండా వెలువడినదని అతడనెను. ప్రతి జాతిలో ఈ సాంప్రదాయము యుండుటయే దైవ ఉనికి గురించి ఒక గట్టి నిదర్శనము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో అల్లాహ్ తాలా సహాయ, సహకారము గురించి వారి అలైహిస్సలాం హృదయ స్థితిని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లు ప్రస్తావించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ వ్యక్తిగత డైరీలో వ్రాసుకున్న విషయమును చూచి ఈ స్థితిని అంచనా వేయగలము. ఇందులో అల్లాహ్ తాలాను ఉద్దేశించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు వ్రాసుకొనిరి. ఓ అల్లాహ్! నేను నిన్నెలా వదిలిపెట్టగలను. మిత్రులందరు నన్ను వీడినప్పుడు నీవే నాకు నమ్మకము కలిగింతువు, నాకు సహకరింతువు. దాని భావము ఇటులనే యుండెను. ప్రతి అహ్మదీయుని ప్రవర్తన విలువ గొప్పగా యుండవలెనని వారు అనేకసార్లు నొక్కిచెప్పిరి. దీని గురించి వారి స్వంత ఉదాహరణ ఎట్లుండెను. వ్యతిరేకులతో కూడ ఎలా మంచిగా వ్యవహరించేవారో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లు తెలిపిరి. ఒక మిత్రుని కథనము ప్రకారము ఒక సారి ఒక బద్ధ వ్యతిరేకి అయిన హిందువు భార్య వ్యాధికి గురైనది. వైద్యుడు సూచించిన మందులలో ముష్క్ కూడ యుండెను. కాని అతనికి ఎక్కడ కూడ అది లభించలేదు. అతడు పశ్చత్తాపముతో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు వచ్చి, మీ దగ్గర ముష్క్ ఉంటే ఇవ్వగలరని వేడుకొనెను. అతనికి బహుశా ఒకటి, రెండు గ్రాముల ముష్క్ అవసరముండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సీసా మొత్తం నింపుకొచ్చి మీ భార్య చాలా బాధతో యున్నది. ఇదంతా తీసుకొని పోగలరని అనిరి.

అశాంతి నుండి దూరముండుటకు గల మార్గమును తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించేవారని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తెలిపిరి. తావూన్ తాన్ నుండి వెలువడినది. తాన్ అనగా బర్ఛితో కొట్టుట. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హాయంలో ప్రకోప శక్తిని చూపిన అల్లాహ్‌యే ఇప్పుడున్నాడు. ఇప్పుడు కూడ తప్పక తన శక్తులను చూపును, మౌనముగా యుండనే యుండడు. మేము మౌనము పాటింతుము. తమను తాము శాంతింపజేసుకోగలరని మేము జమాఅత్‌నకు ఉపదిశింతుము. అన్ని రకాల అశాంతిని చూచినను శాంతితో యుండు జమాఅత్ కూడ ఒకటి ప్రపంచములో యున్నదని మేము చూపెదము.

దుఆలో దుఃఖము ఏర్పడనిచో కృత్రిమంగా రోధించుటకు ప్రయత్నించవలెనని, తద్వారా దుఃఖము ఏర్పడునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేవారు. మనలోని ఒక భాగము దుఆలో అలసత్వము వహించినందునే మనము కొన్ని విషయాలలో అపజయాలు చెంది, శత్రువులలో చిక్కుకొనియున్నాము. (ఈ విషయము నేడు కూడ వాస్తవమేనని హుజూర్ అనిరి) అనేకులు దుఆ చేయడం కూడ ఎరుగరు. దుఆ అనగా మరణమును స్వీకరించుటయే. మానవుడు తనపై ఒక మరణమును ఆవహించుకొనుటయే దుఆ. నేనీ పనిని చేయగలుగుతానని అనుకున్నప్పుడు ఎందుకు సహాయము కొరకు మరొకరిని పిలుచును. తనను తాను మృత్యువుగా భావించి, పూర్తిగా నిస్సహాయకునిగా భావించిన వారే అల్లాహ్ తాలాతో యాచించును. మానవుడు నా దారిలో మరణించనంత వరకు దుఆ కానేకాదు. తనపై ఒక మృత్యువును ఆహ్వానించి, తనను తాను పూర్తిగా శూన్యముగా భావించినవారే దుఆకు అర్హులగుదురు. ఎవరైతే ఈ స్థితిని ఏర్పరచుకొందురో వారి దుఆలే అల్లాహ్ సన్నిధిలో ఆమోదించబడును.

మనలో గొప్ప ప్రవర్తనల ప్రమాణములను నెకొల్పుటలకు, ఆరాధనల ఉన్నత ప్రమాణములను ఏర్పరచుకొనుటకు అల్లాహ్ తాలా మనందరిని అనుగ్రహించుగాక! సదా దుఆల అనుగ్రహము కల్పించుచు, దాని హక్కును చెల్లించు అనుగ్రహమవివ్వుగాక! (ఆమీన్)

BOOK POST (PRINTED MATTER)

To,
..........................................................................
..........................................................................
..........................................................................